క్లుప్తంగా

చెత్త సేకరణ కేంద్రాలకు స్థల పరిశీలన



పోలకల్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని పోలకల్, తిమ్మందొడ్డి గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఈఓఆర్డీ సందీప్ ఆయా గ్రామాలలో స్థలాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. పోలకల్‌లో సర్వే నంబర్ 351లో 5 సెంట్లు, తిమ్మందొడిలో సర్వే నంబర్ 167/2లో 5 సెంట్లను చెత్త సేకరణ కేంద్రాలకు వినియోగిస్తున్న వారు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు రఫీ, తిమ్మన్న, శ్రీనివాసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మిథున్‌రెడ్డి

సి.బెళగల్: వైద్య సిబ్బంది ప్రజలను సీజన్‌లలో వచ్చే జబ్బులపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో వర్షం కురవడంతో తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగేలా చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు మంగమ్మ, మద్దిలేటి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అనుమతులున్న ఎరువులనే అమ్మాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఎరువుల దుకాణదారులు రైతులకు అనుమతులు ఉన్న ఎరువులను మాత్రమే ఎంఆర్పీ ధరలకు అమ్మకాలు జరపాలని ఏఓ మల్లేష్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పోలకల్ గ్రామంలోని శ్రీసాయి రైతు సేవా కేంద్రం, అన్నపూర్ణ ఫర్టిలైజర్స్ ఎరువుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతుల నుంచి వాస్తవికతతో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న విత్తనాలు, మందులను రైతులు ఇవ్వాలని, నిషేధిత మందులు, విత్తనాలు అమ్మినట్లెయితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. మందుల కొనుగోలు దారులకు తప్పనిసరిగా రషీద్‌లను ఇవ్వాలని, ధరలు, నిల్వల బోర్డులను ప్రదర్శించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కల్లూరు : ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పెద్దటేకూరు గ్రామంలోని పేదలకు కేటాయించిన కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ రవికిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య పాల్గొన్నారు.

స్థలాలను పరిశీలించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

కల్లూరు : సల్కాపురం, కె.మార్కాపురం, బొల్లవరం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మాణాలకు స్థలాలను పరిశీలించాలని తహసీల్దార్ ఆంజనేయులు వీఆర్వోలకు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆయా గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీల నిర్మాణాలకు స్థలం కేటాయించాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్థలాలను పరిశీలించి కేటాయిస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ రవికిషోర్, ఏపీఓ మద్దేశ్వరమ్మ, సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా చేయండి

పాణ్యం: బైపాస్ పైపులైన్ లీకేజీతో ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని ఈఈ సుభకుమార్ అన్నారు. మంగళవారం పైపులైన్ లీకేజీ అవుతున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. నీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా కాల్వను తీసినట్లు తెలిపారు. దీని వలన రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

వర్షం...పంటకు నష్టం!

- మినుము రైతులను నిండాముంచిన వరుణుడు
- అధిక వర్షాలతో చెట్టుపైనే వచ్చిన మొలకలు
- ఎనిమిది వందల ఎకరాలలో వాటిల్లిన నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతన్నలు



భారీ వర్షాలకు దెబ్బతిన్న మినుము పంట



మినుము గింజలకు మొలకలు వచ్చిన దృశ్యం

గడివేముల: ఎడతెరిపివ్వని వర్షాతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. నాలుగురోజులుగా కురుస్తున్న వర్షానికి పంటలు నీటి మునిగాయి. ప్రత్యేకించి మినుము రైతులు తీవ్రంగా నష్టపోయారు. గడివేముల మండలంలో వెయ్యి ఎకరాల దాకా మినుము పంటను సాగుచేశారు. ఎకరానికి రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు తెలిపారు. ఎకరానికి 6 నుంచి 8 క్వింటాలు దిగుబడి వచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం క్వింటా రూ.9 వేలు అమ్మకాలు జరుగుతున్నాయి. వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో చేతికి వచ్చిన పంటలో మొలకలు వచ్చాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొందరగా ఆదాయం వచ్చే పంట అయిన మినుమును రైతులు నల్లరేగడి పోలాలలో సైతం సాగుచేశారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడడంతో అదనులోనే విత్తనం వేశారు. పంట ఏపుగా పెరిగింది. పంట చేతి కొచ్చే సమయంలో వర్షాలు ఎడతెరపి లేకుండా పడటంతో మినుము గింజలకు మొలకలు వచ్చి కుళ్లి పోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గడిగరేవుల, చిందుకూరు, తిరుపాడు గ్రామాల్లో మినుము పంటను అధికంగా సాగు చేశారు. వర్షాలతో ఆయా గ్రామాల్లో దాదాపు ఆరు వందల ఎకరాలు పంట నష్టం జరిగినట్లు అంచనా.

ఈ పంట నమోదు చేయని వైనం

ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు చేతి కొచ్చే సమయంలో కూడా ఈ పంట నమోదు చేయలేదు. గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఈ క్రాప్‌ను నమోదు అయ్యేది. ఏ సీజన్‌లో నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే పరిహారం అందేది కూడా. ప్రస్తుతం అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయి. ఇంత వరకు 50 శాతం కూడా పంట నమోదు కాలేదు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలంటే ఈ పంట నమోదే ప్రామాణికం. పంట నష్టపరిహారం అందుతుందో.. లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సోయాబిన్‌కు పొంచివున్న ముప్పు...

ఎడతెరపివ్వని వర్షాల మూలగా ఇప్పటిక మినుము రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాగే మరో రెండురోజులు వర్షం కురిస్తే సోయాబిన్ పంట నష్టం జరుగుతందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో సోయాబిన్ విస్తారంగా సాగు అయ్యింది. అయితే వర్షం రాకముందే 100 ఎకరాలు కోత జరిగింది. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. క్వింటాం రూ. 9 వేలు చొప్పు విక్రయించారు. అయితే వర్షాల మూలంగా ఇప్పుడా పరిస్థితి లేదు. ఇప్పుడిప్పుడే నాట్లు వేసిన మిరప సైతం కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టంపై సర్వే నిర్వహిస్తాం

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తాం. దెబ్బతిన్న మినుము పంటలతోపాటు ఇతర పంటల వివరాలను ఆర్బీకే సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటల వివరాల నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తాం. అధికారులు సమస్యలను వివరించి నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకు తమవంతు ప్రయత్నం చేస్తాం.

–హేమసుందరరెడ్డి,ఏఓ,గడివేముల

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను 20 ఎకరాల్లో మినుము సాగు చేశా. కేసీ కెనాల్‌కు సాగునీరు రావడంతో పంట దిగుబడి బాగా వస్తుందకున్నా. ఇప్పటి వరకు రూ.6 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. ఎకరాకు పెట్టుబడులుపోను రూ.40 వరకు మిగులుతుందని అనుకున్నా. ఎడతెరిపిలేని వర్షాలు కురవడంతో నిరాశే మిగిలింది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం అదుకోవాలి.

– గోపాలయ్య, రైతు, గడిగరేవుల.

రైతులకు పరిహారం అందించాలి



పండెండు ఎకరాలలో మినుము సాగు చేశా. నాకు ఉన్న ఆరు ఎకరాలతో పాటు ఎనిమిది ఎకరాలు కౌలు తీసుకున్నా. పెట్టుబడి ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చు అయ్యింది. రెండు రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గింజలకు మొలకలు వచ్చాయి. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ఉన్నతాధికారులు స్పందించి నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

– చింతల నారాయణ, గడిగరేవుల

కౌలుకు తీసుకుని సాగుచేశా



నాకున్న నాలుగెకరాలతో మరో 12 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మినుము సాగు చేశా. ఎకరా రూ.20 వేలు చొప్పున కౌలుకు తీసుకున్నా. క్వింటాం రూ.13 వేలకు తీసుకువచ్చి నాటా. వర్షాలకు పంట మొత్తం కుళ్లిపోయింది. కాయలకు మొలకలు వచ్చాయి. వ్యవసాయ అధికారులు స్పందించి మా పొలాలను పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

–నగిరి రమణమూర్తి, గడిగరేవుల

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ దుర్మరణం

కర్నూలు: కల్లూరు సుద్దవాగు వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ దుర్మరణం పాలైంది. బెంగళూరు వైపు నుంచి హైదరాబాదు వైపు వెళ్లే మార్గంలో శ్రీచక్ర హాస్పిటల్‌కు ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మహిళ శరీరం ఛిద్రమైంది. మంగళవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించగా ప్రమాదంలో తెగిపడిన చెయ్యి, ఛిద్రమైన శరీరం, చీర కనిపించాయి. కల్లూరు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఎవరైనా చూసి ఉంటే లేదా ఫొటోలు, వీడియోలు తీసి ఉంటే కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఫోన్ నంబర్ 72078 26287కు సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిపై కొడవలితో దాడి.. కేసు నమోదు

కోడుమూరు రూరల్ : ఓ సినీ హీరో పుట్టిన రోజు సందర్భంగా చెలరేగిన వివాదం కొడవలితో దాడి చేసుకునే పరిస్థితికి వెళ్లింది. ఈ సంఘటన కోడుమూరులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం ఓ సినీ హీరో పుట్టినరోజు సందర్భంగా గిప్సన్, రవీంద్ర, రాజశేఖర్ మధ్య చిన్న వాగ్వాదం జరిగింది. తిరిగి ఇదే విషయంపై రాత్రి వారు మరోసారి గొడవకు దిగారు. రవీంద్ర, రాజశేఖర్ అనే వ్యక్తులు గిప్సన్ కాలిపై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో కుటుంబ సభ్యులు గిప్సన్‌ను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి చిన్న గిడ్డయ్య ఫిర్యాదు మేరకు మంగళవారం రవీంద్ర, రాజశేఖర్‌పై ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

కల్లూరు: ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు సాయిబాబా, రాముడు, సుధాకరప్ప, యేసు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా వర్కర్లతో కలిసి శరీన్ నగర్, ముజఫర్ నగర్, ఇందిరా గాంధీ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు ఉన్న ఆశా కార్యకర్తలకు రిటర్మెంట్ బెనిఫిట్ కల్పించాలన్నారు. ఆశ వర్కర్ల పై అధికారుల, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు కష్టవేణి, రాణి, రేణుక, జ్యోతి, మహేశ్వరి, నాగేశ్వరి, జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చెత్త తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి

కల్లూరు: చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) అక్టోబర్ 2 తేదీ నాటికి వినియోగంలోకి తీసుకురావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త నుంచి వర్మి కంపోస్ట్ తయారుచేసి గ్రామ పంచాయతీలకు నిధులు జమ చేయాలన్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

- సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్ నాయక్

పాణ్యం: వినాయ చవితిని ప్రంశాతంగా జరుపుకోవాలని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం పాణ్యంలోని సర్కిల్ కార్యాలయంలో వినాయ మండపాల కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. వినాయక చవితి పురష్కరించుకుని ఏర్పాటు చేసే మండపాల వద్ద కమిటీ సభ్యులు తప్పని సరిగా ఉండాలన్నారు. విగ్రహాలు కొలువుంచేందుకు అనుమతి తీసుకోవాలన్నారు. ఐదురోజుల పాటు పూజల అనంతరం అధికారులు సూచనల మేరకు విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలన్నారు. మండపాలు ఏర్పాటు నుంచి నిమజ్జనానికి తరలించే వరకు కమిటీ నిర్వాహకులదే బాధ్యత అన్నారు. నిమజ్జనం రోజు వినాయక విగ్రహాల వెంట చిన్నపిల్లు, వృద్ధులు రాకుండా సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి ఘాట్‌ల వద్దకు వెళ్లరాదన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులతో గ్రామాలవారీగా ఏర్పాటు చేసే విగ్రహాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమలో ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి , ఏఎస్‌ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి...

గడివేముల: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం వినాయక చవితి కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నాగార్జునరెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. వినాయక విగ్రహాన్ని ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాలకు మూడు రోజులు మాత్రమే అనుమతి ఉంటుందని, ఎక్కడ డీజేలు పెట్టరాదన్నారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కమిటీ సభ్యులదే బాధ్యతని హెచ్చరించారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కోడుమూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. ఈనెల7న ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్, ఎలక్ట్రికల్, ఫైర్, మండల, గ్రామ పంచాయతీ అధికారులు, వినాయక కమిటీ సభ్యులతో తహసీల్దార్ సమావేశమై చర్చించారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను వినాయక కమిటీ సభ్యులు అధికారుల చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఈ ఇస్మాయిల్, ఫైర్ ఎస్‌ఐ మహబూబ్ దావత్, పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్, వినాయక కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, కిరణ్, ప్రతాప్‌రెడ్డి, జీతూరి రవికుమార్, శ్రీనివాసులు, శంకర్, నటరాజ్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సమావేశం లో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి

కల్లూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమ అధికారిని డాక్టర్ హేమలత సూచించారు. మంగళవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పోషకాహార వారోత్సవాల గురించి, 17న నిర్వహించనున్న జాతీయ మహిళా పురుగుల నివారణ దినోత్సవం గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రఘు, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్ రావు, ఎంపీహెచ్‌ఈఓలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌యూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన, జరుగుతున్న అక్రమాలు, అవకతవకలు, అవినీతిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ట్రైబర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా నాన్ టీచింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేసి అక్రమంగా జీతభత్యాలు మంజూరు చేస్తున్నారన్నారు. విద్యార్థుల నిధులను అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు.

పాఠశాలలో ఎరువుల బస్తాలు!



పాఠశాల వద్ద విచారిస్తున్న అధికారులు

పాణ్యం: ఏడేళ్ల క్రితం మూతబడిన పాఠశాల భవనంలో ఎరువుల నిల్వలు ఉండడం స్థానికంగా వివాదంగా మారింది. మండల పరిధిలోని రసూల్లాపేట గ్రామం ప్రాథమిక పాఠశాల మూతపడింది. ఈ పాఠశాల భవనంలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం ఉంచారని కొందరు జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సివిల్‌సప్లై జిల్లా అధికారి వెంకటరాముడు, డీటీ ప్రసాద్ ఎంఈఓ-2సుబ్రహ్మణ్యం, ఏఓ జయప్రకాష్‌రెడ్డి పాఠశాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలను సేకరించారు. అయితే పాఠశాలలో బియ్యం లేవని యూరియా తదితర ఎరువుల 126 బస్తాలున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. కొందరు స్థానిక రైతులు ఎరువులను ఇక్కడ నిల్వ చేసుకున్నట్లు గుర్తించామన్నారు. ఎరువుల బస్తాలను సీజ్ చేసినట్లు ఏఓ జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఎరువుల నిలవ విషయం తెలియదని, ఖాళీ చేయించి భవనాన్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఎరువుల నిల్వ చేసుకోని వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా...!



వెంకటగిరి వద్ద బురదమయంగా మారిన రోడ్డు



గుంతలమయమైన రోడ్డు

కోడుమూరు రూరల్: రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రత్యేకించి కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణాలు చేయలేని విధంగా తయారైంది. వెంకటగిరి నుంచి లద్దగిరి వరకు సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా మోకాటిలోతు గుంతలతో అధ్వాన్నంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గుంతల్లో వర్షపునీరు చేరడంతో కుంటలను తలపిస్తున్నాయి. ఎక్కడ ఏ గుంతలో పడుతామో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 12కిలోమీటర్లు ప్రయాణించేందుకు 40 నిమిషాలకుపైగా సమయం పడుతుంది. కార్లు, ఆటోల వంటి వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లలేక వెంకటగిరి నుంచి ఎర్రదొడ్డి, అనుగొండ, అల్లినగరం గ్రామాల మీదు గా లద్దగిరి వెళ్లి అక్కడి నుంచి వెల్దుర్తికి వెళ్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



వర్షపునీరు నిలిచి కుంటను తలపిస్తున్న లద్దగిరి వద్ద రోడ్డు



గోరంట్ల వద్ద రోడ్డు దుస్థితి...

కూలిన మట్టిమిద్దె

ఓర్వకల్లు: ఎడతెరపివ్వని వర్షాలకు మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో మంగళవారం ఓ మట్టి మిద్దె కూలింది. గ్రామానికి చెందిన రెడ్డిపోగు సుంకన్న ఆటో డ్రైవర్. ఎస్సీ కాలనీలో సుమారు 40 ఏళ్ల క్రితం తాటి దెంతెలపై బండపరుపు వేసి, మట్టితో ఇంటిని నిర్మించుకున్నాడు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాటి దెంతెలు విరగడంతో మిద్దె కూలింది. ఆ సమయంలో సుంకన్న కుటుంబ సభ్యులు బయట రేకుల షెడ్‌కింద నిద్రిస్తుండడంతో ప్రమాదం తప్పింది.

ప్రమాదకరంగా గుంతలు!

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం నుంచి ఆలమూరు గ్రామం వరకు రోడ్డుకు ఒక వైపు ఓ ప్రైవేట్ కంపెనీకి సంబంధించి కేబుల్ పూడ్చేందుకు తీసిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనచోదకులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఎదురుగా వాహనం వచ్చినప్పుడు రోడ్డు దిగితే ప్రమాదంలో పడినట్లే అని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో ఈ గుంతలు కనబడువు. తెలియని వాహన డ్రైవర్లు ఏమాత్రం అదమరిచినా అంతే సంగతి. అధికారులు చర్యలు తీసుకుని ఈ గుంతలను త్వరగా పూడ్చించాలని వాహనదారులు కోరుతున్నారు.



కొణిదేడు గ్రామం వద్ద రోడ్డు పక్కన తీసిన గుంత